నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 10 నవంబర్ 2024 | RANGAREDDY

పిలిచిన పనులకే మళ్లీ.. మళ్లీ టెండర్లు

రీకాల్ మోడ్‌లో హెచ్ఎండీఏ

సిటీబ్యూరో, నవంబర్ 9(నమస్తే తెలంగాణ) : పిలిచిన పనులకే టెండర్లను పిలుచుకుంటూ..హెచ్ఎండీఏ కాలయాపన చేస్తున్నదనే విమర్శలను మూటగట్టుకుంటున్నది. ఇలా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలోనూ అడ్వయిజరీ నియామకానికి కూడా రెండు సార్లు టెండర్లు పిలిచే పరిస్థితి వచ్చింది. కొత్తగా కొత్వాల్‌గూడ ఎకో పార్కులో అరుదైన పక్షుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఈ టెండర్లను రీకాల్ చేశారే తప్ప.. పనుల్లో ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే..

అభివృద్ధి పనులు చేపట్టడంలో హెచ్ఎండీఏ పనితీరు డిఫరెంట్. కానీ అదంతా గతం. ఇప్పుడంతా టెండర్లు పిలవాలి.. కొర్రీలతో పనులను పక్కనపెట్టేయాలి.. వీలైతే మరోసారి టెండర్ రీకాల్ చేస్తే సరిపోతుందనే విధానమే నడుస్తున్నది. ముఖ్యంగా గతంలో చేపట్టిన పనులను కూడా అతి కష్టం మీద గట్టెక్కిస్తున్నామనే తీరుగా పనులు చేపడుతున్నారు. ఇలా ఎప్పుడో పూర్తి కావాల్సిన ప్రాజెక్టులు కూడా ఆలస్యమవుతున్నాయి. దీంతో ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే పక్కన పడుతున్నాయి.

రీకాల్ మోడ్..

ప్రభుత్వం ఓవైపు హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెబుతున్నా... దానికి అనుగుణంగా ప్రణాళికలను అమలు చేయడంలో హెచ్ఎండీఏ అధికారులు శ్రద్ధ పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి తలమానికంగా నిలిచే కీలకమైన ప్రాజెక్టుల విషయంలో అధికారుల వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తున్నది. సీఎం రేవంత్ రెడ్డి గొప్పగా చెప్పుకునే ఎలివేటెడ్, మీరాలం కేబుల్ బ్రిడ్జి ప్రాజెక్టులకు కూడా ట్రాన్సాక్షనల్ అడ్వైజరీ పేరిట పిలిచిన టెండర్లను పొడిగించారు. ఇక కొత్వాల్‌గూడ ఎకో పార్కు విషయంలోనూ ఇప్పటివరకు మూడు సార్లు టెండర్లు పిలిచినా.. పనులు పూర్తి కాలేదు. ఈ క్రమంలో 10వేల విదేశీ పక్షులతో అతిపెద్ద పక్షి శాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు గతంలో టెండర్లను ఆహ్వానించారు. కానీ ఏం జరిగిందో తెలియదు కానీ మరోసారి టెండర్లను పిలుస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. నవంబర్ 9న రీ కాల్ చేయగా... ఐదు రోజుల గడువు నవంబర్ 14తో ముగియనున్నది. దీంతో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, పనులు చేపట్టే సరికే మరో మూడు నెలలు పట్టనున్నది.

టీజీఎస్‌పీడీసీఎల్ లోకి సాయంత్రం 4 తర్వాతే అనుమతి

గంటలోపే పని ముగించుకోవాలట

సిటీబ్యూరో, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఏదైనా పని ఉంటేనే ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వచ్చి వెళ్తుంటారు. అలాంటిది నిబంధనల పేరిట ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల్లోకి రాకుండా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) అధికారులు చర్యలు చేపట్టడంపై విద్యుత్ వినియోగదారులు తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రజలకు సేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన కార్యాలయాలను తమ సొంత సంస్థల్లాగా ఉన్నతాధికారులు భావిస్తూ నిబంధనలు అమలు చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా టీజీఎస్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోకి ప్రవేశించడంపై అమలు చేస్తున్న నిబంధనపలు విమర్శలకు తావిస్తున్నది. సాయంత్రం 4 నుంచి అధికారులను కేవలం 5 గంటల్లోపే కలవాలంటూ పెట్టిన ఆంక్షలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు సాయంత్రం 4 గంటలు కాగానే ఇంటికి వెళ్లే సమయంలో అనుమతిస్తే వారు తమ సమస్యలను సరిగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గేట్లు మూసి వేసి, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయడంతో గేట్ల వద్దే నిత్యం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తున్నది.

15 జిల్లాలకు ప్రధాన కార్యాలయం..

దక్షిణ తెలంగాణలోని 15 జిల్లాలకు సంబంధించి విద్యుత్ సరఫరా వ్యవస్థలను పర్యవేక్షించేందుకు టీజీఎస్‌పీడీసీఎల్ కార్యాలయం ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో ఉంది. ప్రధాన కార్యాలయం కావడంతో ఇక్కడికి గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచే కాకుండా మెదక్, సంగారెడ్డి, నాగర్‌కర్నూలు, సూర్యాపేట, నల్లగొండ, గద్వాల, నారాయణపేట జిల్లాల నుంచి సైతం విద్యుత్ వినియోగదారులతో పాటు కాంట్రాక్టర్లు నిత్యం ఇక్కడికి రకరకాల పనుల కోసం ప్రధాన కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. సుమారు 150 నుంచి 200 కి.మీ దూరం నుంచి వచ్చిన వారికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుమతి లేకపోతే అధికారులను కలిసేదెప్పుడు? వచ్చిన పని పూర్తయ్యేందుకు సమయం ఎక్కడిదంటూ విద్యుత్ వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ వినియోగదారులు సమస్యలు వస్తే మారుమూల ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తుంటారు. అసలు డిస్కం నడిచేదే విద్యుత్ వినియోగదారులు నెల నెలా చెల్లించే బిల్లులపైన. అలాంటి వినియోగదారులను ఎంతో ప్రాధాన్యతనివ్వాల్సిన విద్యుత్ శాఖ అధికారులు ఎన్నడూ లేని నిబంధనలను అమలు చేసి ఇబ్బందులకు గురి చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. జిల్లాల నుంచి వచ్చే వారు సాయంత్రం 5 గంటల వరకు ఇక్కడే గడిపినా పని పూర్తి కాకపోతే మళ్లీ 150 నుంచి 200 కి.మీ దూరం వెళ్లి, మరుసటి రోజు మళ్లీ రావాలంటే ఎన్నో ఇబ్బందులు ఖర్చుతో కూడుకున్నదని వినియోగదారులు వాపోతున్నారు.

శంషాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఏ ఉద్యోగికైనా ఉద్యోగ విరమణ తర్వాత ఎంతో కొంత డబ్బు లొస్తే వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటుంది. నెలవారీగా పింఛన్ అందితే మరింత భరోసాగా కాలాన్ని వెళ్ల దీయొచ్చు. కానీ, చిన్నారులకు అక్షరాలు దిద్దించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం అంగీకరించిన విధంగా తమకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని, సంబంధిత శాఖ మంత్రిని కలిసి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ జిల్లా పరిధిలో 1,107 అంగన్‌వాడీ కేంద్రాలుండగా.. 65 ఏండ్లు దాటిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు 161 మంది ఉన్నారు. - పరిగి, నవంబర్ 9

వృద్ధాప్యంలో వ్యథ..

నాలుగు దశాబ్దాలుగా విధులు...

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కొందరు సుమారు నాలుగు దశాబ్దాలపాటు సేవలు అందించారు. 1985లో విధుల్లో చేరిన వారు ఈ ఏడాది జూన్‌లో ఉద్యోగ విరమణ చేశారు. నాలుగు దశాబ్దాల కాలంలో వారు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతోపాటు వివిధ రకాల సర్వేలను చేపట్టారు. ఓటరు నమోదు ప్రక్రియలో అంగన్‌వాడీ టీచర్లు బీఎల్‌వోలుగా పనిచేయడం, పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సక్సెస్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. ప్రతి చిన్న కార్యక్రమమూ గ్రామాల్లో విజయవంతమయ్యేందుకు అంగన్‌వాడీల సేవలను ప్రభుత్వం వినియోగించుకున్నది. నాలుగు దశాబ్దాలపాటు వివిధ రకాల సేవలందించిన తమకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో ప్రభుత్వం నాన్చుడు ధోరణిని అవలంబించొద్దని వారు కోరుతున్నారు. ప్రభుత్వం అంగీకరించినట్లు అంగన్‌వాడీ టీచర్లకు రూ. రెండు లక్షలు, ఆయాలకు రూ.లక్ష బెనిఫిట్ అందించాలని కోరుతున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటుతున్నా ఇప్పటివరకు తమ డిమాండ్లు పరిష్కరించకపోవడం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ. రెండు లక్షల నగదు.. రూ.ఆరు వేల పింఛన్ ఇవ్వాలి

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్‌ను 65 ఏండ్లుగా నిర్ణయించిన ప్రభుత్వం .. టీచర్లకు రూ.2 లక్షల నగదు, నెలకు రూ.ఆరు వేల పింఛన్, ఆయాలకు రూ.లక్ష నగదు, పింఛన్‌గా రూ.నాలుగు వేలు అందించాలి. ఈ అంశంపై ప్రస్తుత మంత్రి సీతక్కను పలుమార్లు కలిసి విన్నవించగా వారు అంగీకరించారు. అయినా ఒకటి రెండు జిల్లాల్లో మాత్రమే రూ.లక్ష చొప్పున ఇచ్చినట్లు తెలిసింది. ఇది ఎంతమాత్రం సరికాదు. జిల్లాలో ఒక్కరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే అందించాలి.

–కె.నర్సమ్మ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు అందని రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛన్

- నాలుగు నెలలుగా ఎదురుచూపులు
- నాలుగు దశాబ్దాలుగా విధుల నిర్వహణ
- వికారాబాద్ జిల్లాలో 1,107 అంగన్‌వాడీ కేంద్రాలు
- 65 ఏండ్లు దాటిన టీచర్లు, ఆయాలు 161 మంది

65 ఏండ్లు దాటిన టీచర్లు, ఆయాలు 161 మంది..

వికారాబాద్ జిల్లా పరిధిలో సుమారు 161 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు 65 ఏండ్లు పైబడి ఉండడంతో వారిని జూలై ఒకటో తేదీ నుంచి విధులకు రావొద్దని.. వచ్చినా వేతనాలు రావని చెప్పడంతో పలువురు విధులకు వెళ్లడం లేదు. కొందరు తమకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వచ్చేంత వరకు పనిచేద్దామని ఇంకా కొనసాగుతున్నారు. 1985లో విధుల్లో చేరిన అంగన్‌వాడీ టీచర్లకు అప్పటి వేతనం నెలకు రూ. 200, ఆయాలకు రూ.90 ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల కు రూ.13,650, ఆయాలకు రూ.9,000 పెంచింది. తమను రిటైర్ కావాల్సిందిగా సూచించిన ప్రభుత్వం బెనిఫిట్స్ విషయంలో ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు,మూడు జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్లకు రూ. లక్ష చొప్పున పంపిణీ చేయగా, వాటిని వద్దని కార్యకర్తలు చెప్పినట్లు సమాచారం. ఈ విషయంలో పలుమార్లు మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షల నగదు, పింఛన్‌గా నెలకు రూ.6000, ఆయాలకు రూ.లక్ష నగదు, పింఛన్ నాలుగు వేలు అందించాలని కోరుతున్నారు.

వేతనం లేదు, బెనిఫిట్లూ రాలేదు..

జూలై ఒకటో తేదీ నుంచి విధులకు రావొద్దని చెప్పడంతో వెళ్లడం మానేశా. నాలుగు నెలలు దాటినా ఇప్పటివరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాలేదు. నేను బతికేదెట్లా.. కూలికి వెళ్దామన్నా చేతనయ్యే పరిస్థితి లేదు. సర్కారు ఇచ్చే పైసలు ఆసరా అవుతాయని కొండంత ధైర్యంగా ఉండే. కానీ ఇప్పటికీ దిక్కులేదు. సుమారు నాలుగు దశాబ్దాలపాటు సేవలందించా. వృద్ధాప్యంలో ఆసరాగా ఉండేందుకు.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛన్ అమలు చేయాలి. – ఎం.నాగమణి, పరిగి

శిక్షణ లేని సిబ్బందితో సర్వే

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వే అరకొరగా సాగుతున్నది. జిల్లాలో 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు, 549 గ్రామపంచాయతీలుండగా.. 5,57,000 కుటుంబాలున్నాయి. ఈ ఇండ్లను సర్వే చేసేందుకు ప్రభుత్వం 5,344 మంది ఎన్యూమరేటర్లను నియమించింది. అయితే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కుటుంబాల సంఖ్య అధికంగా ఉండడంతో వార్డు ఆఫీసర్లకు ఒక్కొక్కరికీ అదనంగా పదిమంది చొప్పున ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కేటాయించారు. వీరిలో చాలామందికి శిక్షణే లేదు. వారు సర్వే కోసం ఇండ్ల వద్దకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వే ఫారంలోని మొత్తం 75 ఖాళీలను నింపేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ప్రజలు, రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేకపోతున్నారు. కాగా శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సర్వే ప్రారంభమైంది.

-రంగారెడ్డి, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో ముమ్మరంగా వరి కోతలు

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పత్తి ఏరుట, వరి కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు, కూలీలు ఉదయమే పొలాల్లోకి వెళ్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత సర్వే కోసం ఇండ్ల వద్దకు వచ్చిన ఎన్యూమరేటర్లకు తాళాలే దర్శనమిస్తున్నాయి. ఎన్యూమరేటర్లు రాత్రివేళల్లోనూ ఇండ్ల వద్దకెళ్లి సర్వే చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది.

కనిపించని ఎమ్మెల్యేలు.. ప్రజాప్రతినిధులు..

సమగ్ర కుటుంబ సర్వేలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని సక్సెస్ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నా మొదటి రోజు జిల్లాలో ఏ ఒక్క ప్రజాప్రతినిధి కూడా పాల్గొన లేదు. చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నా సర్వేకు దూరంగా ఉన్నారు. అలాగే, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లూ వెళ్లలేదు. కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మాత్రమే సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు.

బడంగ్‌పేటలో 300 బ్లాక్‌ల ఏర్పాటు..

జిల్లాలో 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లున్నాయి. ఈ మున్సిపాలిటీల్లో జనాభా అధికంగా ఉండడంతో సర్వేకు అవరోధం కలుగుతున్నది. మున్సిపాలిటీల్లో మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వార్డు ఆఫీసర్లకు మాత్రమే శిక్షణ ఇచ్చారు. కాగా, కుటుంబాల సంఖ్య అధికంగా ఉండడంతో పని భారాన్ని తగ్గించేందుకు అధికారులు వార్డు ఆఫీసర్లకు ఒక్కొక్కరికీ అదనంగా పదిమంది చొప్పున ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కేటాయించారు. వీరిలో చాలామందికి శిక్షణే లేదు. సర్వే త్వరగా పూర్తి అయ్యేందుకు అధికారులు ఒక్కో మున్సిపాలిటీని 100 నుంచి 300 వరకు బ్లాక్‌లుగా ఏర్పాటు చేశారు. ఒక్కో బ్లాక్‌కు ఒక ఎన్యూ మరేటర్ అవసరం. అంతమంది సిబ్బందిని ఏర్పాటు చేయడం కష్టం కావడంతో.. వార్డు ఆఫీసర్లకు ఒక్కొక్కరికీ అదనంగా పదిమంది చొప్పున ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కేటాయించారు. తుర్కయాంజాల్‌లో 194 బ్లాక్‌లు, ఇబ్రహీంపట్నంలో 100 బ్లాక్‌లు, మీర్‌పేటలో 190 బ్లాక్‌లు, బడంగ్‌పేటలో 300 బ్లాక్‌లు, షాద్‌నగర్‌లో 160 బ్లాక్‌లున్నాయి. ఈ బ్లాక్‌ల్లోని ఇండ్లలోకి సర్వే కోసం వెళ్లే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది..సరైన శిక్షణ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వే ఫారంలోని మొత్తం 75 ఖాళీలను నింపేందుకు ఆపసోపాలు పడుతున్నారు. అంతేకా కుండా ప్రజలు, రైతులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోతున్నారు. వ్యక్తిగత, ఆర్థికపరమైన విషయాలను ప్రజలు చెప్పడంలేదు. దీంతో కుటుంబ సమగ్ర సర్వే అరకొరగా సాగుతున్నది.

- అరకొరగా సాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే
- మున్సిపాలిటీల్లో సరిపడా ఎన్యూమరేటర్లు లేక ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో విధుల నిర్వహణ
- ఒక్కో ఎన్యూమరేటర్‌కు పదిమంది చొప్పున సిబ్బంది కేటాయింపు
- సర్వే ఫారంలోని ఖాళీలను నింపేందుకు ఆపసోపాలు
- ప్రజలు అడిగిన ప్రశ్నలు సమాధానాలు నిల్

సర్వేతో ఒరిగేదేమీలేదు..

ఇరవై ఏండ్లుగా ఇబ్రహీంపట్నంలో అద్దె ఇంట్లో జీవిస్తున్నాం. రెక్కల కష్టాన్నే నమ్ముకున్నాం. రేవంత్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అని చెప్పి ఎన్నికల్లో విజయం సాధించి, వాటిని అమలు చేయడం లేదు. రేషన్ కార్డుకు దరఖాస్తు పెట్టినా ఇప్పటికీ ఇవ్వలేదు. పేదలకు రేషన్‌కార్డులు ఇచ్చిన తర్వాతే ప్రభుత్వం ఇలాంటి సర్వేలు చేస్తే బాగుంటుంది. సర్వేతో ఒరిగేదేమీ లేదు.

– రిజ్వానా, ఇబ్రహీంపట్నం



రేషన్‌కార్డులు ఎప్పుడిస్తారని అడుగుతున్నారు..

ఔట్‌సోర్సింగ్ విధానంలో సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్నా. ఇండ్ల వద్దకెళ్లి బ్యాంకు లావాదేవీలు, పట్టా పాస్‌బుక్కులు, ఆర్థిక పరమైన అంశాలు అడిగితే ఎవ్వరూ చెప్పడంలేదు. చాలామంది రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని అడుగుతున్నారు.

–జయచంద్ర, ఎన్యూమరేటర్

బెంగళూరు ఆదర్శమా?

సిలికాన్ సిటీ విధానం గ్రేటర్‌లో పనిచేస్తుందా..!

హైడ్రా అధికారుల్లో అంతర్గత చర్చ

బెంగళూరు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విషయంలో అక్కడి టెక్నోక్రాట్స్ ఎప్పుడో పెదవి విరిచారు. సిలికాన్ సిటీలో విపత్తుల నిర్వహణ పూర్తిగా ఫెయిల్యూర్ అంటూ పలు సంస్థలు నివేదికలిచ్చాయి. చెన్నై, బెంగళూరు సిటీలను కేస్ స్టడీలుగా తీసుకుని రీసెర్చ్‌స్కాలర్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వైఫల్యాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి తమ రిపోర్టులు తయారు చేశారు. గత నెలలో బెంగళూరులో కురిసిన వర్షాలకు నగరంలో దాదాపు చాలా ప్రాంతాలు నీటమునిగాయి. రెండురోజుల పాటు సిటీ మొత్తం అతలాకుతలమైంది. అక్కడి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పూర్తిగా ఫెయిలయిందంటూ చాలా మంది విమర్శించారు.

సిటీబ్యూరో: బెంగళూరు సిటీలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అధ్యయనం చేయడానికి రెండురోజుల పాటు హైడ్రా బృందం బెంగళూరులో పర్యటించింది. హైదరాబాద్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు చెరువుల పునరుద్ధరణను సంబంధించి బెంగళూరు తరహాలో చేయడానికి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసింది. రెండురోజుల్లో మొదటిరోజు డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు బెంగళూరులో పునరుద్ధరించిన చెరువుల సందర్శన తర్వాత రెండో రోజు లేక్‌మ్యాన్ ఆనంద్‌మల్లిగవాడ్ డెవలప్ చేసిన చెరువులను సందర్శించారు. ప్రధానంగా ఈ పర్యటనలో చెరువుల పునరుద్ధరణలో బెంగళూరులో అవలంబించిన సహజ విధానాలపై హైడ్రా అధికారులు తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో చెరువుల పునరుజ్జీవానికి అప్లై చేయొచ్చా లేదా అనేది ప్రస్తుతం హైడ్రా బృందంలో చర్చ జరుగుతున్నది.

అడ్వాన్స్ టెక్నాలజీలో ముందున్నా..

కర్ణాటక స్టేట్ నేచురల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సెంటర్‌ను హైడ్రా అధికారులు సందర్శించారు. ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు ఎలాంటి చర్యలు చేపడతారో తెలుసుకున్నారు. వరద ముంచెత్తే ప్రాంతాల వారీగా అలర్ట్ చేయడం, ట్రాఫిక్ జామ్ అలర్ట్, ప్రత్యామ్నాయ రహదారులను సూచించే విధానాలపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేఘ సందేశం యాప్ పనిచేసే విధానం, ఈ యాప్ ద్వారా ఏయే ప్రాంతాల్లో ఎంత మోస్తరు వర్షం కురుస్తుంది? ట్రాఫిక్ జామ్, వడగళ్లవానతో పాటు ఇతర వాతావరణ అంశాలతో అలర్ట్ చేసే ప్రక్రియను పరిశీలించారు. అయితే టెక్నాలజీ పరంగా బెంగళూరు ముందున్నా...అక్కడి పరిస్థితులు వేరు.. హైదరాబాద్ పరిస్థితి వేరు.. ఒక వర్షం పడితే బెంగళూరులో రహదారులే కాదు.. అపార్ట్‌మెంట్లే వరద నీటిలో మునిగిపోతుంటాయి. మెట్రో రైళ్లు ఉన్నా ట్రాఫిక్ సమస్య ఇప్పటికీ తీరలేదు. బెంగళూరు తరహాలోనే హైదరాబాద్‌లోనూ ట్రాఫిక్ సమస్య ఉన్నది. వర్షం పడితే గంటల తరబడి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ సమస్య తలెత్తడం.. కొన్ని ప్రాంతాల్లో ప్రయాణించాలంటేనే నగరవాసికి ప్రత్యక్ష నరకం కనిపిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. కానీ బెంగళూరు తరహాలో హైదరాబాద్‌లో తీవ్రత లేదని హైడ్రా అధికారులే చెబుతున్నారు. అసలు హైదరాబాద్‌లో బెంగళూరు సిస్టం పనిచేస్తుందా..? టెక్నాలజీ పరంగా అక్కడి సెన్సార్‌ల వ్యవస్థ బాగానే ఉన్నా.. డిజాస్టర్ పరంగా బెంగళూరు మేనేజ్‌మెంట్ సక్సెస్ కాలేదని అధికారులు అంటున్నారు. గ్రేటర్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో గతంలో పనిచేసిన అధికారులతో పాటు జీహెచ్ఎంసీ సిబ్బందితో క్షేత్రస్థాయిలో ఎలా ఉంటుందో చర్చించి ఒక నిర్ణయానికి రావాలని అనుకుంటున్నట్లు తెలిసింది. గతంలో కర్ణాటక ప్రభుత్వ పెద్దలు హైదరాబాద్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌ను చూసి వెళ్లారు. బెంగళూరు కంటే ఇక్కడే బాగుందంటూ కితాబు కూడా ఇచ్చారు. మరి ఇప్పుడు హైడ్రాకు బెంగళూరు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అంతగా నచ్చిందంటే కారణమేమిటోనన్న చర్చ జరుగుతున్నది.